శుక్రవారం సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని బస్వాపూర్ ఉన్నత పాఠశాలలో సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ఆయన ప్రారంభించారు. పిల్లలతో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేశారు. కోహెడ మండలంలోని నాగసముద్రాలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం కోహెడలో రూ.2 కోట్ల 48 లక్షలతో చేసిన పనులను ప్రారంభించారు.



బస్వాపూర్ ఉన్నత పాఠశాలలో పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ పెడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్


# ‘సీఎం బ్రేక్ ఫాస్ట్’ పిల్లలకు వరం


- హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్
- సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలో రూ. 3 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

కోహెడ, అక్టోబర్ 6: బడి పిల్లలకు సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం వరమని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని బస్వాపూర్ ఉన్నత పాఠశాలలో సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ఆయన ప్రారంభించారు. పిల్లలతో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేశారు. కోహెడ మండలంలోని నాగసముద్రాలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం కోహెడలో రూ.2 కోట్ల 48 లక్షలతో చేసిన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గొప్ప సంకల్పంతో బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించారన్నారు. పల్లెల అభివృద్ధే ధ్యేయంగా కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. రూ. 672 కోట్లు మధ్యాహ్న భోజనానికి, సన్న బియ్యం కోసం రూ.187 కోట్లు, కోడి గుడ్ల కోసం రూ. 120 కోట్లు, అదనంగా 20 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తున్నదన్నారు. మన ఊరు– మన బడి పథకం కింద రూ. 32.65వ లక్షలతో కోహెడలో నిర్మించిన డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, టాయిలెట్ బ్లాక్, బస్ షెల్టర్ మోడల్ స్కూల్ భవనాలు,కోహెడలోని ప్యాక్స్ కార్యాలయంలో సీఎస్‌సీ సెంటర్‌ను ప్రారంభించారు. పీహెచ్‌సీలో 20 లక్షలతో నిర్మించనున్న వాటర్ ట్యాంకుకు భూమి పూజ చేశారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న బీరప్ప ఆలయాన్ని సందర్శించి కురుమలతో మాట్లాడారు. కురుమలు గొంగడి కట్టి గొర్రె పిల్లను బహూకరించారు. అంతకుముందు బస్వాపూర్‌లో ఎంపీపీ కొక్కుల కీర్తి, ఘనంగా స్వాగతించారు. శాలువాలతో సన్మానించారు. కోహెడలో సర్పంచ్ పేర్యాల నవ్య, ప్యాక్స్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు పూలకుండీని అందజేసి స్వాగతించారు. కార్యక్రమాలలో ఎంపీపీ కొక్కుల కీర్తి, ఎన్నికల ఇన్‌చార్జి గవ్వ వంశీధర్‌రావు, ప్యాక్స్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు, ఏఎంసీ చైర్మన్ తిప్పారపు జ్యోతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆవుల మహేందర్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కొక్కుల సురేశ్, సర్పంచ్‌లు ఎడబోయిన సత్తయ్య, తైదల రవీందర్, ఎంపీటీసీ కొడిముంజ మల్లవ్వ, నాయకులు పొన్నాల లక్ష్మణ్, తిప్పారపు శ్రీకాంత్, ఇప్పరపల్లి అనంతరాములు, అబ్దుల్ రహీం, బండ వెంకటస్వామి, కుమారస్వామి, చుక్క అశోక్, యాద అశోక్, జాలిగాం శంకర్, కోనె శేఖర్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు పుష్పాలు అందజేస్తున్న చిన్నారులు


కోహెడలో పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్


కాంపౌండ్ వాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్


నాగసముద్రాలలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

# డబుల్ పండుగ

## హోతి(కే)లో 666 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు సిద్ధం

- రూ. 34.98 కోట్లతో 666 ఇండ్ల నిర్మాణం
- రూ. 25 కోట్లతో మౌలిక సదుపాయాలు
- ప్రతి బ్లాక్‌లో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్
- చివరి దశలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, మిషన్ భగరీథ పనులు
- గృహప్రవేశాలు చేయించేందుకు భారీ ఏర్పాట్లు
- నేడు లబ్ధిదారులకు పట్టాలు అందజేయనున్న మంత్రి హరీశ్‌రావు
- మున్సిపాలిటీలో రూ. 30 కోట్ల పనులకు శంకుస్థాపనలు
- 3వేల మందికి గృహలక్ష్మి మంజూరు పత్రాలు పంపిణీ
- బాగారెడ్డి స్టేడియంలో భారీ బహిరంగ సభ
- పెద్దఎత్తున జనసమీకరణకు బీఆర్ఎస్ శ్రేణుల కసరత్తు

### 3వేల మందికి గృహలక్ష్మి మంజూరు పత్రాలు

జహీరాబాద్ మున్సిపల్, మండలం, మొగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో మూడు వేల మందికి మంత్రి హరీశ్‌రావు గృహలక్ష్మి మంజూరు పత్రాలు అందజేయనున్నారు. ఇందుకోసం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. గ్రామాల వారీగా లబ్ధిదారులను ఎంపిక చేసి అర్హుల జాబితాను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

### మున్సిపాలిటీలో రూ. 30 కోట్ల పనులకు శంకుస్థాపనలు

జహీరాబాద్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ రూ. 30 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులన్నింటికీ నేడు మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపనలు చేయనున్నారు. 37 వార్డుల్లో సీసీ రోడ్లు, మురికి కాల్వలు, బీటీ రోడ్లు నిర్మించాలని మున్సిపల్, ఇంజినీరింగ్ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. టెండర్లు వేసి పనులు ప్రారంభించేందుకు ఇంజినీరింగ్ అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ప్రతి వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

### భారీ జనసమీకరణ



ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు పర్యటనకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నాం. హోతి(కే) శివారులో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ప్రారంభించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేసి గృహప్రవేశాలు చేయిస్తాం. ప్రభుత్వ జూనియర్ కళాశాల అవరణలో నిర్వహించే బహిరంగ సభకు ప్రభుత్వ పథకాలతో లబ్ధిపొందిన లబ్ధిదారులు హాజరవుతారు. నియోజకవర్గంలో 3వేల మందికి మంత్రి హరీశ్‌రావు గృహలక్ష్మి మంజూరు పత్రాలు అందజేస్తారు.

– కొనింటి మాణిక్‌రావు, ఎమ్మెల్యే జహీరాబాద్


సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని హోతి(కే) శివారులో నిర్మాణం చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు

జహీరాబాద్, అక్టోబర్ 6: నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు సీఎం కేసీఆర్ రూ. కోట్లు ఖర్చు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించి ఉచితంగా అందజేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని హోతి(కే) శివారులో బీఆర్ఎస్ ప్రభుత్వం 666 ఇండ్లు నిర్మించింది. రూ. 5.30 లక్షలతో ఒక్కో డబుల్ బెడ్ రూమ్ నిర్మించగా, 666 ఇండ్ల కోసం సర్కారు రూ. 34.98 కోట్లు ఖర్చు చేసింది. మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ. 25 కోట్లు మంజూరు చేసింది. మున్సిపల్ పరిధిలో లబ్ధిదారులను గుర్తించేందుకు గతంలోనే సర్వే నిర్వహించిన అధికారులు డ్రా ద్వారా అర్హులను ఎంపిక చేశారు. నేడు జహీరాబాద్ పట్టణంలో లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై గృహప్రవేశాలు చేయించనున్నారు.

### రూ. 34.98 కోట్లుతో నిర్మాణం

జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని హోతి(కే) శివారులో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 34.98 కోట్లతో 666 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించింది. మిషన్ భగరీథ, కరెంట్, సీసీ రోడ్లు, మురికి కాల్వలు, పార్కు తదితర మౌలిక సౌకర్యాలు కల్పించడంతో పాటు రోడ్ల పక్కన చెట్ల పెంపకం చేస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని 37 వార్డులకు చెందిన నిరుపేదలతో పాటు మున్సిపాలిటీలో విలీనమైన అల్లీపూర్, పస్తాపూర్, రంజోల్, చిన్న హైదరాబాద్, హోతి(కే) గ్రామాల్లో నివాసం ఉంటున్న పేదలకు ఇండ్లు పంపిణీ చేయనున్నారు. రెవెన్యూ అధికారులు వార్డుల వారీగా సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించి డ్రా ద్వారా ఎంపిక చేశారు.

### రూ.25 కోట్లతో మౌలిక సదుపాయాలు..

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం రూ. 25 కోట్లు మంజూరు చేసింది. సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, కరెంట్ సౌకర్యం ఏర్పాటు చేశారు. స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రత్యేక పైపులైన్ వేసి మంజీరా నీటిని సరఫరా చేయనున్నారు. బ్లాక్‌ల వారీగా ట్రాన్స్‌ఫార్మర్లు బిగించడంతో పాటు ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తెచ్చారు.

### గృహప్రవేశాలకు భారీగా ఏర్పాట్లు

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలోకి గృహప్రవేశాలు చేయించేందుకు అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు పర్యటన సందర్భంగా ఎక్కడా సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పండుగ వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఎమ్మెల్యే మాణిక్‌రావు, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్‌రావు, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎం. శివకుమార్‌లు చర్యలు తీసుకున్నారు. పబ్లిక్ హెల్త్ ఈఈ ప్రతాప్‌కుమార్, సంగారెడ్డి జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి శ్రీనివాస్‌ప్రసాద్, కాంట్రాక్టర్ రమణారెడ్డిలు దగ్గరుండి పనులు చేయించారు.


డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పరిశీలిస్తున్న రాష్ట్ర బేవరేజేస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం

## మంత్రి పర్యటనకు భారీ ఏర్పాట్లు

- 20 వేల మందితో బహిరంగ సభ
- గులాబీ యమంగా జహీరాబాద్ పట్టణం

జహీరాబాద్, అక్టోబర్ 6: రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు, బీఆర్ఎస్ నాయకులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. 20 వేల మంది జనసమీకరణ చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు గ్రామాల వారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్‌రావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఏర్పుల నరోత్తమ్, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మన్ తన్వీర్, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎం. శివకుమార్‌లు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జహీరాబాద్ పట్టణంలోని ప్రధాన రోడ్డు వెంట పార్టీ బ్యానర్లు, జెండాలు ఏర్పాటు చేయడంతో అంతా గులాబీమయంగా మారింది. ప్రధాన చౌరస్తాలు, బహిరంగ సభా వేదిక వద్ద జెండాలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు.

### మంత్రి తన్నీరు హరీశ్‌రావు పర్యటన షెడ్యూలు

- మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో ఝరాసంగం మండలంలోని నిమ్జ్ ప్రాంతానికి చేరుకుంటారు.
- 2.45కు నిమ్జ్ నుంచి రోడ్డు మార్గంలో ఝరాసంగం చేరుకుని స్థానికంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు.
- 3.30కు మండలంలోని బిడెకన్నె గ్రామంలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తారు. గ్రామంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వేసిన 52 బోర్లను ప్రారంభిస్తారు.
- 4.15కు జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని పస్తాపూర్ శివారులో ఏర్పాటు చేసిన మాజీ ఎమ్మెల్యే బాగన్న విగ్రహావిష్కరణ చేస్తారు.
- 4.45కు హోతి(కే) శివారులో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రారంభిస్తారు.
- 5.15 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభా వేదిక వద్ద డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పత్రాలు, గృహ లక్ష్మి మంజూరు పత్రాలు, క్రీడా కిట్స్, బీసీ బంధు, మైనార్టీ బంధు, మహిళా సంఘాలకు చెక్కులు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేస్తారు.
- 6.30 జహీరాబాద్‌లోని దత్తగిరి కాలనీలో బసవేశ్వర్ మందిర్‌లో అదనపు గదులను ప్రారంభిస్తారు.
- 7.30 గంటలకు కోహీర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన మహిళా డిగ్రీ కళాశాలను ప్రారంభిస్తారు.

### అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం



హోతి(కే) శివారులో నిర్మించిన 666 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం రూ. 25 కోట్లు మంజూరు చేసింది. ఈ నెల 7న పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. సీసీ రోడ్లు, మురికి కాల్వలు, కరెంట్ సౌకర్యం, మిషన్ భగరీథ పనులు చివరిదశకు చేరుకున్నాయి. లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించి, సమావేశం నిర్వహిస్తాం. మంత్రి హరీశ్‌రావు పర్యటనలో ఎలాంటి సమస్యలేకుండా అధికారులు, కాంట్రాక్టరు పర్యవేక్షణ చేస్తున్నారు.

– ప్రతాప్‌కుమార్, పబ్లిక్ హెల్త్ ఈఈ సంగారెడ్డి

### భారీ బహిరంగ సభ

జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో శనివారం భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు సభకు ముఖ్యఅతిథిగా హాజరు అవుతుండడంతో బీఆర్ఎస్ నాయకులు, అధికారులు ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. 3 వేల మంది గృహలక్ష్మి లబ్ధిదారులతో పాటు వారి కుటుంబసభ్యులు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులు సభకు రానున్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి జన సమీకరణ చేసేందుకు అధికారులు, బీఆర్ఎస్ నాయకులు ప్రణాళికలు రూపొందించారు. వర్షం పడినా వేదికకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. మహిళా సంఘాలకు రుణాల మంజూరు పత్రాలు అందించనున్నారు.



గజ్వేల్‌లోని సమీకృత కూరగాయల మార్కెట్

# నాడు ఇబ్బందులు.. నేడు సౌలత్‌లు

## గజ్వేల్‌లో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్

- రోజుకు 10క్వింటాళ్ల కూరగాయల విక్రయం
- ఆనందం వ్యక్తం చేస్తున్న వ్యాపారులు

గజ్వేల్, అక్టోబర్ 6: గత ప్రభుత్వాల హయాంలో కూరగాయల వ్యాపారులు ఎండ, వాన, చలిని లెక్కచేయకుండా రోడ్లపైనే రోజూ కూరగాయల విక్రయాలు చేపట్టారు. వర్షాకాలం వచ్చిందంటే వ్యాపారుల తిప్పలు అన్నీ ఇన్నీ కావు. 2014లో గజ్వేల్ నుంచి కేసీఆర్ గెలుపొందిన తర్వాత వ్యాపారుల బాధలు తెసుకొని సమీకృత మోడల్ మార్కెట్‌ను నిర్మించాలనే ఆలోచనతో పట్టణ నడిబొడ్డు వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం చేపట్టడంతో వ్యాపారల బాధలు తొలిగిపోయాయి. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులతో వ్యాపారులు ఫిదా అయ్యారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యాధునిక హంగులతో సమీకృత మార్కెట్ వినియోగంలోకి వచ్చింది. గజ్వేల్ పట్టణంలోని సమీకృత కూరగాయల(వెజ్ నాన్‌వెన్) మార్కెట్‌ను సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో రూ.22.85కోట్లతో ఆరు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించగా 2019లో వినియోగంలోకి తీసుకొచ్చారు. ఇందులో కూరగాయలు, పూలు, పండ్లు, మాంసం, చేపలు, సూపర్ మార్కెట్ల కోసం విడివిడిగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఇందులో మొత్తం 246 స్టాల్స్ ఏర్పాటు చేయగా అందులో 52 స్టాళ్లు మాంసం, చేపల విక్రయానికి, 111 స్టాళ్లు కూరగాయలు, 83 స్టాళ్లు పూలు, పండ్ల విక్రయానికి కేటాయించారు. ఇందులో మహిళలే ఎక్కువగా తమ వ్యాపారం కొనసాగిస్తున్నారు. రోజుకు 10క్వింటాళ్ల కూరగాయలు, 3క్వింటాళ్ల పూలు, 2 క్వింటాళ్ల పండ్లు అమ్ముడవుతున్నాయి. రోజూ సగటున రూ.12లక్షల లావాదేవీలు జరుగుతున్నాయి. ఈ సమీకృత మార్కెట్ నిర్వహణ బాగుండడంతో గత కొద్ది రోజుల క్రితం ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు లభించింది. ఈ మార్కెట్ పైన క్లాక్ టవర్ నిర్మాణం ఎంతో అద్భుతంగా ముస్తాబు చేశారు.

### ఇబ్బందుల నుంచి బయటపడ్డా...



గజ్వేల్‌కు కేసీఆర్ రాక ముందు కూరగాయలు అమ్ముకోవాలంటే రోడ్లపైనే వ్యాపారం కొనసాగించాం. ఎన్నో ఇబ్బందులు పడ్డాం. వర్షాకాలంలో వాన కొడుతున్నా గొడుగుపట్టుకొని కూరగాయలు విక్రయించిన సందర్భాలు ఉన్నాయి. తమ బాధలు తెలుసుకున్న సీఎం కేసీఆర్ సమీకృత మోడల్ మార్కెట్ ఒకే చోట నిర్మించడంతో అన్ని విధాలుగా బాగుంది. ప్రతి ఒక్కరూ ఇక్కడికే వచ్చి కూరగాయలు కొనుకునే విధంగా మార్కెట్ కట్టించడంతో రోడ్లపైన అమ్ముకునే బాధలు పోయాయి. ఇంత మంచి మార్కెట్ కట్టించిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

– రామచంద్రం, కూరగాయల వ్యాపారి

### ఎన్నో అర్జీలు పెట్టాం



గజ్వేల్‌లో రైతు బజారు కట్టించాలని ఎన్నోసార్లు అధికారులకు అర్జీలు పెట్టాం. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ స్పందించలేదు. కేసీఆర్ గజ్వేల్‌కు రాకతోనే మా బాధలు పోయాయి. కొద్ది రోజుల్లోనే గజ్వేల్ నడిబోడ్డున సమీకృత కూరగాయల మార్కెట్ నిర్మాణం చేపట్టడంతో ఇప్పుడు ఎలాంటి బాధలు లేవు. ఒక దగ్గరనే కూరగాయలు, పూలు, పండ్లు, మాంసం, చేపలు, కిరాణా సరుకులు దొరుకుతున్నాయి. ఇక్కడి మార్కెట్‌ను చూసేందుకు అధికారులు, ఇతర రాష్ట్రాల నుంచి ప్రజాప్రతినిధులు వస్తున్నారు.

– కొలిచెలిమే స్వామి, కూరగాయల వ్యాపారి


సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో సమీకృత కూరగాయల మార్కెట్‌లో అమ్ముతున్న కూరగాయలు